ఆహ్లాదం అంతేనా..?

● నత్తనడకన ప్రహరీల నిర్మాణం
● బుడమేరు వెంట సుందరీకరణను పట్టించుకోని అధికారులు



దేవీనగర్ మెయిన్ రోడ్డులో అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ ఎనిమిదో రోడ్డు వరకు బుడమేరు పక్కన ఆక్రమణలు జరగకుండా చూడటంతో పాటు సుందరీకరణ కోసం ఫెన్సింగ్, ప్రహరీ పనులను వీఎంసీ అధికారులు చేపట్టారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే రామకృష్ణాపురం ప్రారంభంలోనే అమ్మవారి ఆలయం వద్ద కొంత మేర స్థలాన్ని దేవాలయానికి వదలివేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ వరకు పనులు పూర్తిచేశారు. కానీ ఫెన్సింగ్ పనులు పూర్తయ్యినప్పటికీ ఇక్కడ సుందరీకరణ పనులు మాత్రం ఇంత వరకు ప్రారంభించలేదు. ఇక్కడ చెత్తచెదారం తొలగించడంతో పాటు కనీసం ఒక మొక్క నాటిన పాపాన పోలేదు. కనీసం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం రోజున కూడా ఇక్కడ మొక్కలు నాటకపోవడం అధికారుల అలసత్వాన్ని తెలియజేస్తోందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎక్కడి వ్యర్థాలు అక్కడే..

దేవీనగర్‌లో ప్రహరీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇక్కడ కొంత మేర పనులు పూర్తిచేసినప్పటికీ ప్రహరీ లోపల మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో చెత్తచెదారం పిచ్చి మొక్కలు పెరిగిపోయి దోమలు, విషసర్పాలకు నిలయంగా మారిందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవీనగర్ మూడో రోడ్డు వద్ద ఇటీవల సుమారు ఆరు అడుగుల పాము సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల బుడమేరు పనుల్లో భాగంగా పక్కన ఉన్న వ్యర్థాలు, చెట్లను తొలగించారు. అయితే అవి తొలగించిన ప్రాంతాన్ని మాత్రం శుభ్రం చేయలేదు. అలాగే వీఎంసీ కమిషనర్ సైతం తన పర్యటనలో భాగంగా ఈ ప్రాంతాన్ని సుందరీకరించాలని ఆదేశించారు. అయినప్పటికీ ఇక్కడ సుందరీకరణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రహరీ నిర్మించడం మంచిదేనని.. కానీ బుడమేరు పక్కన శుభ్రం చేసి సుందరీకరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



దేవీనగర్ యూజీడీ పంపింగ్ స్టేషన్ వద్ద నిర్మించిన ప్రహరీ



ప్రహరీ లోపల చెత్తచెదారం, పిచ్చిమొక్కలు

క్లుప్తంగా

నేడు 31వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో సోమవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్యాలంపాడు దేవాలయం వీధిలో సాయంత్రం ఆరు గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే నగర బహిష్కరణకు గురికావాల్సి వస్తుందని సత్యనారాయణపురం ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.వి లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఆదివారం సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. వారు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. సత్ప్రవర్తనతో పనులు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

గణపతి లడ్డూ రూ. 1.16 లక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీనగర్ కాలనీ ఒకటో లైనులో శ్రీగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో 11 కిలోల లడ్డూను వేలంలో రూ. 1.16 లక్షలకు దేవరపు మాల్యాద్రి దంపతులు దక్కించుకున్నారు. శ్రీగణేష్ ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు కొండా మాలకొండయ్య, అధ్యక్షుడు గద్దం శ్రీనివాసరావు, కార్యదర్శి మేడసాని చంద్రశేఖర్, కోశాధికారి అడుసుమిల్లి బాలాజీ తదితరులు ఆలయ అర్చకులతో ప్రత్యేక పూజలు నిర్వహించి మల్యాద్రి దంపతులకు లడ్డూను అందజేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



పులిరాజా

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక నిమజ్జనం చూడటానికి వెళ్లిన తన తన తమ్ముడు తిరిగి ఇంటికి రాలేదంటూ ఆదివారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం మేరకు.. గాంధీజీ కాలనీకి చెందిన పులిరాజా(30) శనివారం రాత్రి వినాయక నిమజ్జనాలు చూసి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. కానీ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టు పక్కల వెతకగా తెలిసిన వాళ్లు రామవరప్పాడు ఫ్లైఓవర్‌పై వద్ద కాలువలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కొట్టుకుపోవడం చూశామని తెలిపారు. దీంతో కాలువలో కొట్టుకుపోయింది తన తమ్ముడేమోనని అతని అన్నయ్య పులి రత్న గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): షాపులో పనికి వెళ్లిన కుమార్తె ఇంటికి తిరిగి రాలేదని తల్లి చేసిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. శాంతినగర్‌కు చెందిన చింతలచెరువు లక్ష్మికి ఇద్దరు కుమార్తెలు. భర్త చనిపోయాడు. లక్ష్మి పెద్దకుమార్తె ప్రకాష్‌నగర్‌లోని ఓ మొబైల్ షాపులో పనిచేస్తుంది. ఈ నెల ఆరవ తేదీన యథావిధిగా షాపులో పనికి వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మహిళ అని కూడా చూడకుండా తనను కులం పేరుతో అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన సింగ్‌నగర్ ఎస్ఐ దుర్గా మహేశ్వర్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి ఆదివారం ఎస్ఎస్‌పురం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి వివరాల మేరకు.. శనివారం రాత్రి సింగ్‌నగర్‌లో వినాయక నిమజ్జన ఊరేగింపును ఎస్ఐ దుర్గా మహేశ్వర్ అడ్డుకోగా నాగలక్ష్మి ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించింది. దీంతో నన్నే ప్రశ్నిస్తావా అంటూ ఆమెను కులం పేరుతో, అసభ్యకరంగా దుర్భాషలాడాడు. ఈ మేరకు ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదు చేశారు.

డ్రోన్‌లతో ట్రాఫిక్ నియంత్రణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డులో ఆదివారం డ్రోన్‌లతో ట్రాఫిక్ నియంత్రణ చేశారు. డ్రోన్‌లను ఎగురవేసి మారుమూల ప్రాంతాల్లోని ట్రాఫిక్‌లను సైతం గుర్తించి అవసరమైన చర్యలు తీసుకున్నామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వాహనచోదకులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా డ్రోన్‌లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

నేడు ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా సోమవారం సత్యనారాయణపురం రాజేశ్వరి వీధిలోని స్టార్ ఫిజియోథెరపీ సెంటర్‌లో ఉచిత శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డాక్టర్ ఎం.ప్రభుదాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఉచిత ఫిజియోథెరపీ శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఫిజియోథెరపీ సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతులకు అండగా 'అన్నదాత పోరు'



అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మల్లాది విష్ణు, కార్పొరేటర్లు, నాయికులు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): యూరియా కోసం మండుటెండల్లో బారులు తీరి నిలబడిన రైతులకు అండగా వైఎస్సార్ సీపీ 'అన్నదాత పోరు' కార్యక్రమం చేపట్టిందని ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఈ నెల 9వ తేదీన నందిగామలో తలపెట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని జనహిత సదనంలో ఆదివారం జరిగింది. దీనిలో పాల్గొన్న విష్ణు మాట్లాడుతూ గతంలో వ్యవసాయం దండుగ అన్న చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చిన ప్రతిసారి రైతులను నిలువునా మోసం చేస్తూ వస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అబద్ధపు మాటలతో రైతులను ఏ విధంగా మభ్యపెట్టారో ఈ ఏడాది పాలన చూస్తేనే అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో రైతులు ఇన్ని విధాలుగా సమస్యలను ఎదుర్కొంటుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా వారిని అవమానించే విధంగా మాట్లాడుతున్నారన్నారు.

యూరియా సరఫరాలో విఫలం

ప్రతి ఏడాది రాష్ట్రంలో రైతులకు ఏడు లక్షల దాకా యూరియా అవసరం అవుతుందని.. దానిని రైతులకు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మల్లాది విష్ణు విమర్శించారు. వైఎస్సార్ సీపీ తలపెట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమాల్లో రైతులు పాల్గొనవద్దని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వల్ల రైతులంతా యూరియా కొరతతో ఇబ్బందులు పడుతుంటే వాటిని పరిష్కరించాల్సిన సీఎం చంద్రబాబు యూరియా వాడితే క్యాన్సర్ వస్తుందని చెప్పడం హేయమని విమర్శించారు. రైతుల పక్షాన సమస్యలపై తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులంతా తరలివచ్చి రైతులకు అండగా నిలబడాలని విష్ణు పిలుపునిచ్చారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు ఎండీ షాహీనాసుల్తానా, శర్వాణీమూర్తి, ఇసరపు దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్, గుండే సుందర్‌పాల్, త్రివేణిరెడ్డి, జాన్సీ, నాగేంద్ర, వెంకటేశ్వరరెడ్డి, ఎ.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు




ముత్యాలంపాడులో గంగానమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీగంగానమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మహిళలచే కుంకుమ పూజలు శాస్త్రోక్తంగా చేయించారు. అనంతరం మహిళలు అమ్మవారికి లలితా సహస్రనామ పారాయణం, శ్రీగంగానమ్మ చాలీసా, గంగానమ్మ అష్టోత్తరం చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మందపాటి యుగంధర్ వర్మ మాట్లాడుతూ తాము ప్రతి పౌర్ణమికి లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు గొడవర్తి నరేంద్రవర్మ, ఉప్పలపాటి మురళీ కృష్ణంరాజు, ఉప్పలపాటి సత్యనారాయణరాజు పర్యవేక్షించారు.



నిరాశ చెందిన గ్రహణ సందర్శకులు



చంద్రగ్రహణాన్ని చూడటానికి వచ్చిన సందర్శకులు మేఘాల కారణంగా తీవ్ర నిరాశకు గురయ్యారు. చంద్రగ్రహణం సందర్భంగా గాంధీహిల్ ఫౌండేషన్, జనవిజ్ఞానవేదిక, విజయవాడ స్కై వాచర్స్ సంయుక్తంగా గ్రహణాన్ని వీక్షించేందుకు గాంధీహిల్ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాట్లు చేశాయి. ఆదివారం రాత్రి తొమ్మిది గంటల నుంచి గ్రహణాన్ని తిలకించేందుకు పలువురు సందర్శకులు హాజరయ్యారు. అయితే మేఘాల కారణంగా గ్రహణాన్ని వీక్షించడానికి అవకాశం కలగలేదు. కొద్దిసేపు ఎదురు చూసిన సందర్శకులు మేఘాలు తొలగకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు.

–వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత




పాయకాపురం(విజయవాడరూరల్): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జగదీశ్వరి పేర్కొన్నారు. ఆదివారం కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ ఆవరణం శుభ్రం చేసి, సున్నం చల్లి శ్రమదానం చేశారు. స్థానికులు ఇళ్లల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, డ్రెయినేజీ కాల్వలో వ్యర్థాలను వేయకూడదని జగదీశ్వరి సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు భక్తులు, ఉభయదాతలు సేవలో పాల్గొన్నారు. సేవ అనంతరం ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సూర్య భగవానుడిని ఆరాధించడం వల్ల ఆరోగ్య సిద్ధి, ఐశ్వర్యం, ఆయుష్షు వృద్ధి చెందుతాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామంలోని సుగాలి కాలనీలో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు 150 మందికి నిర్వహించి ఉచితంగా మందులను, కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.నాగరాజు మాట్లాడుతూ పోషక విలువలు గల ఆకుకూరలు, కూరగాయలు వాడాలన్నారు. అన్నం తక్కువ, కూర ఎక్కువగా ఉండేలా భోజనం చేయాలని సూచించారు. వైద్యులు షేక్ ఫిరోజ్, వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. గిరిజన సంఘం సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు.

ఆలయాలు మూసివేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): సంపూర్ణ చంద్రగ్రహణం పురస్కరించుకుని నగరంలోని పలు దేవాలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయ ఆలయం, ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం, శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీకోదండ రామాలయం, అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం, తదితర ఆలయాలు మూసివేశారు. సోమవారం ఉదయం ఆయా ఆలయాల్లో మహాసంప్రోక్షం, స్థపన, నవగ్రహ శాంతి నిర్వహించి భక్తులను అనుమతిస్తామని నిర్వాహకులు తెలిపారు.

విజయవాడ కల్చరల్: కంచికామకోటి పీఠ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శారదా చంద్రమౌళీశ్వరస్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం నిర్వాహకులు మూసివేశారు. గ్రహణం అనంతరం ఆలయంలో మహాసంప్రోక్షం, స్థపన, నవగ్రహ శాంతి నిర్వహించి సోమవారం ఉదయం తొమ్మిది గంటల తర్వాత దర్శనానికి అనుమతిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



సీఐ కిషోర్‌బాబు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రహదారులపై సురక్షితంగా ప్రయాణించడం కోసం ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి అని మూడవ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్ బాబు తెలిపారు. ఆదివారం సత్యనారాయణపురంలోని మూడవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో రోడ్డు భద్రత, మోటరు వాహనాల చట్టాలపై ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడ కమిషనరేట్ పరిధిలో ముఖ్యంగా నగరంలోని అన్ని ప్రధాన రహదారులపై సీసీ కెమెరాలు అమర్చబడి నిరంతరం పనిచేస్తున్నాయన్నారు. వాటి ద్వారా ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనను స్పష్టంగా గుర్తించి, సంబంధిత వాహనదారులపై చలానాలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిబుల్ రైడింగ్, వన్-వే అతిక్రమణ, ఫ్రీ లెఫ్ట్ ఉల్లంఘన, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి వాటిపై చలానాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే హెల్మెట్ కేవలం చలానాల నుంచి తప్పించుకోవడానికి కాకుండా తమ జీవితానికి రక్షణగా భావించాలని సూచించారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మధురంగా సాగిన సంగీత కచేరి



సంగీత కచేరి నిర్వహిస్తున్న రంగాచార్యులు

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు మద్దులపల్లి లక్ష్మీనారాయణ సంస్మరణ సందర్భంగా ఆదివారం దుర్గాపురం శివరామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో సంగీత విద్వాంసుడు ఎన్‌సీ రంగాచార్యులు నిర్వహించిన గాత్ర సంగీత సభ శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన వల్లభనాయక, త్యాగరాజస్వామి కీర్తన శ్రీనారద, దొరకునా ఇటువంటి సేవ, ఎన్‌సీహెచ్ కృష్ణమాచార్యులు రచన గౌరీ సుకుమారి కీర్తనలను మధురంగా ఆలపించారు. పాలపర్తి నాగేశ్వరరావు, మంగళగిరి శ్రీధర్, మార్టూరి హరిబాబులు వాద్య సహకారం అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు ఎన్‌సీహెచ్ బుచ్చయ్యాచార్యులు మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతం నిరంతరం ప్రవహించే గంగా ప్రవాహమన్నారు. రంగాచార్యులు సంగీత సేవకే అంకితమయ్యారని పేర్కొన్నారు. అనంతరం సంగీత విద్వాంసుడు రంగాచార్యులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, ముద్దులపల్లి సత్యనారాయణమూర్తి, దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషతోనే మనో వికాసం



సభలో పాల్గొన్న సాహితీవేత్తలు, గాయకులు

విజయవాడ కల్చరల్: మాతృభాషతోనే మనో వికాసం కలుగుతుందని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు పేర్కొన్నారు. తెలుగు కళావాహిని, శ్రీకళాభారతి, ఆది లీలా ఫౌండేషన్, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు భాషా దినోత్సవం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని కొత్తా పూర్ణానందం కళావేదికపై నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ మాతృభాషలో మాట్లాడటం ఆత్మగౌరవానికి గుర్తుగా భావించాలని చెప్పారు. గాయకుడు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో ఘంటసాల విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు, బీవీ వీరభద్రరావు, కే డేవిడ్ పాల్గొన్నారు. గాయకులు మల్లాది స్వాతి, అయ్యప్పన్, దుర్గానాగమణి, రంజానీ, సీహెచ్ మాధవి పలు సినీ గీతాలను ఆలపించారు.

చక్రవర్తి సేవలు అపూర్వం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బ్యాంకు ఎంప్లాయీస్ ఉద్యమ నేత తారకేశ్వర చక్రవర్తి ట్రేడ్‌యూనియన్ రంగాలకు అందించిన సేవలు అపూర్వమని పలువురు వక్తలు పేర్కొన్నారు. చక్రవర్తి శత జయంతి వేడుకల్లో భాగంగా కృష్ణా జిల్లా బ్యాంక్ ఉద్యోగుల కో–ఆర్డినేషన్ కమిటీ రక్తదాన శిబిరాన్ని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం మాట్లాడుతూ ఏఐబీఈఏను ప్రారంభించి తారకేశ్వర చక్రవర్తి బ్యాంకు ఉద్యోగుల హక్కుల కోసం ఏ విధంగా పాటుపడినది వివరించారు. ఎన్నో లక్షల మందికి బ్యాంకు ఉద్యోగ సాధనలో ఆయన చూపిన పోరాట పటిమ అపూర్వమని కొనియాడారు. తారకేశ్వర చక్రవర్తి అందించిన స్ఫూర్తిని కొనసాగించే దిశగా బ్యాంకు ఉద్యోగులు పాటుపడాలని సూచించారు. అనంతరం ఉద్యోగుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘాల నేతలు బీఎస్ రాంబాబు, పీవీ కృష్ణారావు, టి.రవీంద్రనాథ్, ఎన్.సుబ్బారావు, కె.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ సెంట్రల్ :
90102 01611
Office mail : sakshiads@gmail.com